# పరువు ప్రతిష్ట

"ఛీ. . . అవిటిదానా! మళ్ళీ నోరెత్తావంటి వళ్ళు వాచిపోతుంది క్రోధంగా అన్నాడు కరుణాకరం

అతని మాటలకు రెచ్చిపోయిందతని భార్యయైన ఆరతి

అవిటిదానా! అవిటిదానా! అంటూ మాటకు ముందు గేలి చేస్తారెందుకు? నేను అవిటి దాన్నని



కిశోరి

తెలిసి యాభైవేల కట్నానికి ఆశపడి ఆనాడు చేసుకున్నారు మీరు. ఆనాడు కనిపించలేదా నాలోని అవిటితనం?" తీక్షణంగా ప్రశ్నించింది.

"అవును. కట్నాన్ని చూసే చేసుకున్నాను గాని, నీ అవిటితనాన్ని చూసి జాలిపడి చేసుకోలేదు. నోరు మూసుకుని కుక్కలాగా పడి వుండు. నా దారికెప్పుడూ అడ్డురాకు."

"కుక్కలాగా పడి వుండటానికి కాదు మిమ్మల్ని పెళ్ళి చేసుకుంది. నేను మీ భార్యను. ఈ ఇంట్లో మీకెంత హక్కుందో నాకూ అంత హక్కుంది. ఇంకా ఎక్కువ మాట్లాడితే మీరే నేను చెప్పినట్లు వినాలి యాభై వేలు పోసి మిమ్మల్ని కొన్నాను కనుక." అంది ఆవేశంగా ఆరతి.

"ఏమిటి కూశావ్? నన్ను కొన్నావా?" అంటూ ఆవేశంతో రెచ్చిపోయి ఆమె జుట్టు దొరకబుచ్చుకొని ముందుకు వంచి వీపు మీద దభీ.... దభీ.... మంటూ పిడిగుద్దులు గుద్దాడు.

ఆ దెబ్బలకు తాళలేక "అమ్మా" అంటూ అరుస్తూ క్రిందపడి పోయిన ఆరతిని నిర్దాక్షిణ్యంగా కాలితో ఒక తాపు తన్ని వీధిలో కెళ్ళిపోయాడు కరుణాకరం.

చిన్నతనంలోనే పోలియో వచ్చి ఒక కాలు అవిటిదైంది ఆరతికి. మోకాలిపై చెయ్యివేసి వంగుతూ నడవవలసిందే. అందమైన ఆరతికి భగవంతుడు విధించిన శాపం ఆ అవిటితనం. పెరిగి పెద్దవయె కొద్దీ తల్లిదండ్రులకు గుండెల మీద కుంపటి అయ్యింది. సంబంధం చూడటానికి వచ్చిన ప్రతి ఒక్కరు ఆరతి అందాన్ని చూసి పరవశించారు. కాని అవిటితనమని తెలియగానే వెనుకంజ వేసేవారు. ఎంత అందం వున్నా ఏమి లాభం? ఆమె అవిటితనాన్ని చూసి జాలిపడే వారే గాని పెళ్ళి చేసుకోగల విశాల హృదయం లేకపోయిందెవరికి. ఇలా వచ్చిన సంబంధమల్లా వెనక్కు పోతుంటే ఆరతి మనసు గాయపడసాగింది. ఆమె పెళ్ళి గురించిన ఆశలువదులుకుంటున్న తరుణంలో కరుణాకరం వాళ్ళువచ్చారు ఆమెను చూసు కోవడానికి. ఆరతి అవిటితనం గురించి తెలుసుకునే వచ్చారు. యాభై వేలు కట్నమడిగారు ఆరతి తండ్రిని. కరుణాకరంకు. తన కూతురికి వయసులో చాలా తేడా వున్నా, అతను నిరుద్యోగి అని తెలిసినా ఆ సంబంధానికి ఒప్పుకున్నాడు ఆరతి తండ్రి వెంకట్రామయ్య. తనకు కావలసింది నిర్భాగ్యురాలైన తన కూతురి వివాహం. అందుకే వున్న ఇల్లు తాకట్టు పెట్టి, యాభైవేలు కట్నమివ్వాలని తీర్మానించుకున్నాడు. అలా వారి వివాహం జరిగిపోయింది. పెళ్ళిలో నమ్రతగా మాట్లాడుతున్న అల్లుణ్ణి చూసి గర్వపడ్డాడు వెంకట్రామయ్య ఇల్లు తాకట్టు పెట్టానన్న బాధను కూడా మరిచి ఎలాగైనా ఆరతికి పెళ్ళి చేయ గలిగినందుకు సంతోషించాడు.

వివాహమై అత్తవారింటికి వచ్చాక వారి అసలు రూపం తెలుసుకున్న ఆరతి కృంగిపోయింది. కరుణాకరం ఉద్యోగం కోసం ప్రయత్నం చేసి, చేసి చివరకు ఉద్యోగ వయసు దాటిపోయింది. అందుకే ఆరతి గురించిన సమాచారం వినగానే కరుణాకరం తలిదండ్రులతో కలిసి ప్లాన్ వేసుకొని ఆరతి సంబంధం ఖాయం చేసుకున్నారు. పెళ్ళైవచ్చాక ఆ కట్నం డబ్బుతో "ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్" తెరిచాడు బ్యాంక్‌లో కూడా లోన్ తీసుకుని. షాపు పెట్టి స్థిరపడ్డ క్షణం నుండి కరుణాకరం భార్యను మానసికంగా, శారీరకంగా బాధ పెట్టసాగాడు.

"నిరుద్యోగిని నీకు పిల్లనివ్వను" అన్న అతని మేనమామ కరుణాకరం షాపు తెరవగానే అక్కతో, బావగారితో రహస్యంగా మంతనాలాడి కరుణాకరంను కూడా ఒప్పించాడు తన కూతురిని వివాహం చేసుకొనేందుకు. ఆ విషయం గ్రహించిన ఆరతి భర్తను నిలదీసి ప్రశ్నించిందా రోజు. అందుకు ప్రతిఫలమే ఈ నాటి యీ సంఘటన. అలా తనను కొట్టి నిర్దాక్షిణ్యంగా వీధిలోకి వెళ్ళిపోతున్న భర్తను కళ్ళనీళ్ళతో చూసింది ఆరతి.

"భగవాన్! నేనేం పాపం చేశానని నాకీ అవిటితనాన్నిచ్చావు? ఇస్తే ఇచ్చావు. నన్ను ఆడదానిగా ఎందుకు పుట్టించావు? నీకసలు హృదయమనేది లేదు. అందుకే నీవు రాయివయ్యావు." కనపడని దేవుణ్ణి మనసులోనే నిందించుకోసాగింది తన కవిటితనాన్ని ప్రసాదించినందుకు.

తను తెచ్చిన డబ్బుతో షాపు పెట్టుకుని తనకంటూ ఒక స్థానాన్ని కలిగించుకుని ఇప్పుడు తనను "రసంలోని కరివేపాకులా" తీసి ప్రక్కన పారవేస్తున్నారు. అంటే తన అవసరం అతనికి తీరిపోయింది. తనను అలా హింసిస్తుంటే తనకేమి పట్టనట్లు బైట వరండాలో కూర్చుని భగవద్గీత చదువుకుంటున్న అత్తగారైన లక్ష్మమ్మను అసహ్యించుకొంది. "ఛీ....ఛీ....ఈమెదీ ఒక ఆడ జన్మేనా? స్త్రీయై పుట్టి, తోటి స్త్రీని అందునా అవిటిదైన కోడలిని తన కొడుకిలా హింసిస్తుంటే తనకు ఏమ కుట్టినట్లయినా లేకుండా భగవద్గీత చదువుతూ కూర్చుంది. చేసే పాపం చేస్తూ భగవద్గీత చదువుకుంటే మోక్షం వస్తుందనుకొందా? ఇటువంటి వారిని ఆ భగవంతుడు క్షమిస్తాడనుకుంటుంది కాబోలు" అని మనసులోనే అత్తగారిని ఛీదరించుకొంది ఆరతి.

ఆమె నెమ్మదిగా ప్రక్కనే వున్న గది గోడను ఆధారం చేసుకుని లేచి గోడ కానుకుని నిలబడింది. కళ్ళనీరు తుడుచుకొని; రేగిన కురులు సవరించుకుంటూ మోకాలిపై చేయి ఆనించుకుని నడుస్తూ వంటింట్లో కెళ్ళింది. అలా నడుస్తుంటగా వీపంతా వచ్చి పుండులాగా అనిపించింది. ఆ బాధనంతా పంటి బిగువున భరిస్తూ వెళ్ళింది ఆరతి.

★ ★ ★ ★

ఒకరోజు ఏదో పని మీద ఆ వూరికి వచ్చి ఆరతిని చూచేందుకు వెళ్ళాడు వెంకట్రామయ్య. ఆ సమయంలో కరుణాకరం బజారు కెళ్ళాడు ఏదో పని మీద. షాపులో జనం ఎక్కువగా వచ్చినందు వల్ల కరుణాకరం తండ్రి బలరామయ్య, తల్లి లక్ష్మమ్మ ఇద్దరూ షాపులో కూర్చున్నారు.

సన్నబడి, నల్లబడ్డ ఆరతిని చూడగానే వెంకట్రామయ్య హృదయం ద్రవించి పోయింది.

"అమ్మా! ఏమిటి తల్లీ! ఇలా అయ్యావు?" అతని కంఠంలో ఆవేదన ధ్వనించింది.

"నాన్నా!" తండ్రిని చూడగానే గుండెల్లోని వేదన పొంగి పొరలగా దుఃఖోద్వేగంతో అతని ఒడిలో తలదాచుకుని బావురు మంది ఆరతి. అలా ఏడుస్తున్న కూతురిని చూస్తున్న కొద్దీ అతని మనసులో అలజడి కలిగింది. గుండెల నెవరో పిండి నట్లయింది. అతని కంటి నుండి రెండు కన్నీటి బొట్లు టప, టపారాలి ఆరతి తలపై బడి ఇంకి పోయాయి. తన హృదయవేదన తీరేదాకా ఏడ్చిన



## కోరిక

రాయాలని ఉంది
కలల మరచి కనులు తెరిచి
నిజమేదో రాయాలని ఉంది
స్పందించిన గుండె పలికించే నాదాన్ని
దిశ దిశలా వినిపించాలని ఉంది
కన్నుల చాటున కదిలే కథలను
మనసుల మాటున ఒదిగే వ్యధలను
ఓదార్చాలని ఉంది
కరుడు గట్టిన హృదయాలను కరిగించాలని

మోడు వారిన జీవితాలలో వసంతం
పూయించాలని ఉంది
భయం బ్రతుకు బంధాలు తెంచాలని
ఆనందామృతాన్ని పంచాలని ఉంది
అలుముకున్న నిశీధిని మసి చేయాలని
పేరుకు పోయిన కల్మషాన్ని
కడిగి వేయాలని ఉంది
ఐకమత్యపు బావుటాలు ఎగురవేయాలని
అనురాగపు సౌరభాలు వెదజల్లాలని ఉంది

—వేముగంటి శ్రీనివాస్

# పరువు – ప్రతిష్ఠ

ఆరతి తండ్రి బుజ్జగించడంతో లేచి కూర్చుంది.

"ఏమిటి తల్లీ ! ఎందుకింత బాధ పడుతున్నావ్? చెప్పమ్మా?" లాలనగా అడిగాడు. అసలు విషయమంతా కూతురి నోటి వెంట విని హతాశుడయ్యాడాయన. అడిగినంత కట్నం ఇస్తే బాగా చూసుకుంటాడని అనుకున్నాడే గాని ఇలా కూతురి జీవితం నాశనం అవుతుందనుకోలేదు. పెళ్ళప్పుడు వినయంగా మాట్లాడుతున్న అల్లుణ్ణి గుణవంతు డనుకున్నాడే గాని కాలసర్ప మనుకోలేదు. అయినా ఇప్పుడు తను మాత్రం ఏం చేయగలడు పెళ్ళి జరిగిపోయాక? అందుకే బిడ్డను అనునయింప చూశాడు.

"ఆరతీ! ఏం చేద్దాం చెప్పు తల్లీ? సర్దుకు పోక తప్పదమ్మా. నీ భర్తను నీవే ప్రేమతో దారికి తెచ్చుకోవాలే గాని, నీ వెంత? అంటే నీవెంత? అని అనరాదమ్మా. త్రాడును తెగేదాకా లాగరాదు. నీవే సర్దుకుపోవాల".

"హు..... సర్దుకు పోవడం? ఎంత బాగా చెప్పారు నాన్నా? అడుగడుగునా నా అవిటి తనాన్ని వేలెత్తి చూపుతూ నన్ను కించపరుస్తుంటే సర్దుకు పొమ్మంటారా? పెళ్ళై కొద్ది నెలలైనా కాకముందే మరో పెళ్ళి చేసుకోవాలని చూస్తుంటే సహించమంటారా నాన్నా?" వెక్కిళ్ళ మధ్య అంది.

"చేసుకోవాలను కున్నంత మాత్రాన చేసుకుంటాడామ్మా? తాళికట్టిన భార్యవు నీవుండగా ఎలా చేసుకుంటాడు? రేప్రొద్దున అలాటిది జరిగితే కేసుపెట్టమూ?"

"ఎప్పుడూ? నేను చచ్చాకనా?"

"ఎందుకమ్మా అలా మాట్లాడుతావు?" ఆమె మాటలు శరాఘాతంలా మనసున నాటుకోగా బాధతో అన్నాడు.

"అవును నాన్నా! అంతే జరుగుతుంది చూస్తుండండి".

"అలా జరుగడానికి వీల్లేదు." గట్టిగా అరిచినట్లుగా అన్నాడతను.

"వీళ్ళు ఎంతకైనా తెగించిన మనుషులు నాన్నా! అంతపనీ చేస్తారు" అని క్షణమాగి

"నాన్నా! నన్నీ నరకం నుండి మనింటికి తీసుకెళ్ళరూ?" అంటూ ప్రాధేయపడింది.

"పాపా!....." క్షణం నివ్వెర పోయాడాయన.

"ఎందుకు నాన్నా! అలా విస్తుపోతారు? నేను మీకేం భారంగా వుండనులే. ఇంటర్ దాకా చదివించారు నన్ను. ఏదో ఒక వుద్యోగం చేసుకొంటూ నాకాళ్ళపై నేను నిలబడతాలే నాన్నా! అంది.

అమ్మా! అదికాదు తల్లీ ! నీ ఒక్కదానివీ భారమా మాకు? కానీ ... కానీ .... అత్తిల్లు వదిలి పుట్టిల్లు చేరిన ఆడదాన్ని చూసి ఈ లోకం హర్షిస్తుందను కుంటున్నావా? కాకుల్లా పొడవదూ? పదుగురిలో అది ఎంత పరువు తక్కువ పనో ఆలోచించావా? నిన్ను చూసి నలుగురూ చాటు మాటుగా హేళనగా నవ్వుకుంటుంటే నా మనసెంతగా క్రుంగి పోతుందో ఆలోచించావా?" వేదనగా అన్నాడాయన.

అతని మాటలకు పేలవంగా నవ్వింది ఆరతి.

"బాగా చెప్పారు నాన్నా! కన్నకూతురి కన్నా పరువు ప్రతిష్ఠే ముఖ్యమనుకొంటే, నన్ను చూసి నలుగురు హేళనగా నవ్వుకుంటుంటే మీ మనసు క్రుంగి పోతుందనుకొంటే నన్ను తీసుకెళ్ళకండి. నన్నీ నరకంలోనే వుండనివ్వండి. ఏపూటో ఒక పూట మీకూతురు చచ్చిపోయిందని తెలుస్తే వచ్చి నాలుగు కన్నీటి బొట్లు రాల్చి వెళ్ళండి." అంటూ వెక్కి వెక్కి ఏడువసాగింది.

ఆ మాటలకు కలవర పడ్డాడు వెంకట్రామయ్య . అయినా తన కల్లవరం పైకి కనపడ నివ్వకుండా.

ఎందుకమ్మా? అంత లేని మాటలు మాట్లాడుతావు? నీవేదో ఆవేశంలో అలా అంటున్నావు. శాంతంగా కూర్చుని ఆలోచించు. నా మాటల్లో ఎంత నిజముందో మగణ్ణి విడిచిన స్త్రీని ఈ లోకం ఎంత చులకనగా చూస్తుందో నీకు తెలియదు". అన్నాడు కూతురి తలపై చేయి వేసి నిమురుతు.

అతనలా అనగానే కళ్ళు తుడుచుకుని చివ్వున తల ఎత్తి తండ్రి వంక చూసింది.

"బాగా ఆలోచించే యీ నిర్ణయం తీసుకున్నాను నాన్నా! మీకు వుత్తరం వ్రాద్దామనుకుంటుండగానే మీరే వచ్చారు. అయినా మీరింకా పాతకాలపు పద్ధతిలోనే ఆలోచిస్తున్నారు. కాలం మారిందని మరిచి పోతున్నారు."

ఆ మాటలకు నవ్వాడాయన.

"పిచ్చితల్లీ! నీకింకా చిన్న పిల్లవు. లోకం తీరు తెలియదు నీకు. కాలం ఎంతగా మారినా మనుషులు మాత్రం మారలేదమ్మా".

"అయితే మీరు నన్ను తీసుకెళ్ళరా నాన్నా?" ఇక తండ్రితో వాదించి లాభం లేదనుకొని చివరిసారి ఆశగా అడిగింది.

ఆ మాటకు పెద్దగా నిట్టూర్చాడాయన.

"ప్రస్తుతానికి వద్దు తల్లీ! మరికొద్ది రోజులు వేచిచూడు. నీ పరిస్థితి మారకపోతే అప్పుడాలోచిద్దాం. నాకు కాస్త వూళ్ళో పని వుంది. ఈ రాత్రికి మీ శేషయ్య అంకుల్ ఇంట్లో వుండి తెల్లారాక వూరెళ్తాను. నీవు మాత్రం మరొక్క మారు బాగా ఆలోచించమ్మా" అన్నాడు కుర్చీ నుండి లేస్తు. ఇక తండ్రి తన బాధ నర్థం చేసుకోలేదని తెలిసుకుంది ఆరతి. తండ్రికి తనకన్నా పరువు, మర్యాద లెంత ముఖ్యమో అర్థం చేసుకో గలిగింది. అందుకే మరి మాట్లాడలేక పోయింది. నెమ్మదిగా ఆయన పాదాలను కళ్ళకద్దుకుంది.

"అరెరె.... ఏమిటమ్మా ఇది? లే.... లే" అన్నాడాయన.

"కాఫీ త్రాగి వెళుదురు గాని వుండండినాన్నా!" ఆమె కప్పుడు గుర్తుకు వచ్చింది తండ్రికి కాఫీ కూడా ఇవ్వలేదని. తండ్రి కనపడగానే హృదయంలోని ఆవేదనంతా వెళ్ళబోసు కోవడంలో కాఫీ ఇవ్వాలన్న సంగతి గుర్తురాలేదామెకు.

"ఇప్పుడేమీ వద్దమ్మా! ఇందాకే త్రాగి వచ్చాను. మీ మామ, అత్తా షాపులో వున్నారు కాబోలు. పలుకరించి వెళతాను" అంటూనే వెళ్ళి పోయాడాయన. తండ్రి వెళ్ళిన వైపు పేలవంగా చూస్తుండి పోయింది ఆరతి.

★ ★ ★ ★ ★

"ఈమె సంసార జీవితానికి పనికిరాదు" అని వున్న కాగితంపై సంతకం పెట్టమని వేధించసాగాడు కరుణాకరం, ఆరతిని.

"లేదు. నేను పెట్టను. ఎందుకు పెట్టాలి?" ధైర్యంగా అడిగింది ఆరతి.

"పెట్టి తీరాలి. నీవు సంతకం పెడితే నేను లక్షణంగా మా మామ కూతురిని పెళ్ళి చేసుకోవచ్చు." అన్నాడు వెకిలిగా నవ్వుతు.

ఆ నవ్వు చూడగానే కంపరమెత్తింది ఆరతికి.

"ఏమిటి? మీ మామ కూతురును చేసుకుందామనా? ఈ ఎత్తు?"

"చేసుకున్నా నీ కేమి లోటు రానివ్వనులే డియర్! నిన్ను కూడా భార్యలాగానే చూసుకుంటాలే" హేళనగా అన్నాడు.

"భార్య లాగా! అంటే? నన్ను మీరిప్పుడు వుంచుకున్నారా?" ఆరతి కూడా వ్యంగ్యంగానే అంది.

ఆమాటకు చెర్రెత్తుకొచ్చింది కరుణాకరంకు.

"షటప్!......" అరిచినట్లుగా అన్నాడు.

ఈ తర్క వితర్కం అనవసరం. సంతకం పెడతావా లేదా? కఠినంగా అడుగుతూ ముందు కడుగు

వేశాడు.

"నేను పెట్టను......" ధైర్యాన్ని కూడ దీసుకుంటూ ఒక్కడుగు వెనక్కేసింది.

"పెట్టవూ......?" తీక్షణంగా అడుగుతూ మరో అడుగు ముందుకేశాడు.

"చచ్చినా పెట్టను......"

అంతే. ఛెళ్ళుమన్నాయి ఆమె చెంపలు. అతను చేసిన ఆ పనితో తనను తను నిలద్రొక్కుకోలేక దబ్బున క్రింద పడిపోయింది.

"చచ్చాక నీవేమిటి పెట్టేది? పెడతావా? లేదా?" కాలు పైకెత్తాడు ఆమెను తన్నడానికి.

అతనలా బలవంతం చేసే కొద్దీ ఆమె మనసు కఠినంగా, మొండిగా మారసాగింది.

"పెట్టను......"

"పెట్టవూ కాలితో బలంగా తంతూ మళ్ళీ అడిగాడు రెట్టిస్తూ.

"పెట్టను....." మొండిగా అంది ఆ దెబ్బల బాధను పంటి బిగువున భరిస్తూనే.

"ఒరే కరుణా! అది అలా వింటుందనుకున్నావా? ఇదిగో ఈ కిరోసిన్ పొయ్యి" అంటూ కిరోసిన్ డబ్బా అందించింది. అంతవరకు మౌనంగా ఆ దృశ్యాన్ని తిలకిస్తున్న అతని తల్లి.

"ఛీ ......'నీవూ ....ఒక ఆడదానివేనా?" నరరూపరాక్షసి లాంటి అత్తగారిని చూసి ఛీత్కరించింది ఆరతి.

"ఇటువంటి అత్తలుండబట్టే ఎందరో అమాయకులైన అబలల బ్రతుకులు మొగ్గలోనే రాలిపోతున్నాయి" అనుకొంది మనసులో. వాళ్ళు తప్పకుండా తనను కాల్చి చంపుతారనుకోగానే ఆమెలో ప్రాణ భయం కలగ్గా నెమ్మదిగా లేవబోయేంతలోనే కరుణాకరం తల్లి అందించిన డబ్బాను తీసుకుని గుమ్మరించాడు ఆరతిపై. అవిటితనం ఆరతిని పారిపోకుండా చేసింది.

కిరోసిన్ ఏనుగు తొండం వంటి ధారతో తలపై పడుతుండగా వుక్కిరిబిక్కిరి అవుతూ పైకి లేవబోయి దబ్బున క్రిందపడి పోయింది.

"ఇప్పటికైనా పెడతావా? లేదా?" క్రూరంగా చూస్తూ ఆమెను రెక్కపట్టుకొని పైకి లేపి అడిగాడు.

"వూ హుం......" తల విదిలించిందామె.

"అయితే చావు.......!" అంటూ విసురుగా ఆమెను పొయ్యి వైపు తోశాడు. ఆ విసురుకు కట్టెలతో గణ, గణా మండిపోతున్న పొయ్యిపై పడ్డది ఆరతి. అతని క్రూరత్వాన్ని చూసి, రోసిన అగ్నిదేవుడు ఆరతిని ప్రియమార కౌగిలించుకున్నాడు.

అది చూసి వికటాట్టహాసం చేస్తూ కొడుకు, ఆ వెంటనే తల్లి వంటింటి బైటకు వచ్చి తలుపులు వేసేశారు. నిస్సహాయురాలైన ఆరతి ఆర్తనాదాలు ప్రతిధ్వనించ సాగాయా గదిలో

"అమ్మా........! ఆరతీ" అంటూ కెవ్వుమని కేక వేస్తూ లేచిన వెంకట్రామయ్యను.

"ఏమిట్రా రామయ్యా? ఏదైనా కలగన్నావా?" వెంకట్రామయ్య వేసిన కేకకు వులిక్కిపడి లేచిన శేషయ్య ఆత్రంగా స్నేహితున్ని భుజాలు పట్టి కుదిపాడు.

"ఆ.....ఆ....కలా....!" బిత్తర చూపులు చూస్తూ అన్నాడు వెంకట్రామయ్య స్వప్నావస్థ నుండి తేరుకుంటూ.

"అవును....పీడకల ఏదైనా వచ్చిందా?" ఆప్యాయంగా అడుగుతూ అతని వెన్ను నిమిరాడు శేషయ్య.

అప్పటికి గాని వాస్తవ ప్రపంచంలోకి రాలేకపోయాడు వెంకట్రామయ్య రాత్రి పొద్దుపోయే దాకా కూతురిని గురించి ఆలోచిస్తూ పడుకున్న తను కలలో అలాంటి ఘోర సంఘటన చూడగానే నిలువెల్లా వణికిపోతు కెవ్వున కేక వేస్తూ లేచాడు.

"ఏమిట్రా ఆ కల?" లేచి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి అందిస్తూ అడిగాడు శేషయ్య. గ్లాసుడు నీళ్ళు గడగడా త్రాగాక కుదుటపడింది వెంకట్రామయ్య మనసు. అప్పుడు చెప్పాడు నిన్న సాయంత్రం తనకు ఆరతికి జరిగిన సంభాషణ.

అది విని గాఢంగా నిట్టూర్చాడు శేషయ్య.

"చూడరా రాముడూ! అమ్మాయి చెప్పింది సబబుగానే వుంది. తను ఎంతటి నరక మనుభవిస్తేనో గాని అమ్మాయి నీకు చెప్పదు. సామాన్యంగా ఏస్త్రీ అయినా తన సంసారం స్వర్గతుల్యంగా వుండాలనే కోరుకుంటుంది. ఏ స్త్రీ అయినా భర్తకు అనుకూలంగా వుండి, అతని ప్రేమకు పాత్రురాలు కావాలనే చూస్తుంది. తన చేయి దాటిపోయాకనే ఇల్లు విడవాలన్న నిర్ణయం తీసుకుంటుంది. నీ కలలో లాగే వాస్తవంగా జరిగితే నీవు తట్టుకోగలవా? నీ వనుకునే ఆ పరువు, ప్రతిష్ఠని ఒక్కగానొక్క కూతురుని బ్రతికించ గలవా? చెప్పు...?" ఆవేశంగా అడిగాడు శేషయ్య.

"లేవు... బ్రతికించలేవు....." దుఃఖంతో వెంకట్రామయ్య కంఠం రుద్ధమైంది. తిరిగి ఇలా అన్నాడు.

"శేషూ! అలా జరుగడానికి వీల్లేదు. ఒక్కగానొక్క కూతురు పోయాక మేము బ్రతికి ఏమి ఫలం? ఆ జన్మాంతం కుమిలిపోతు బ్రతకాలి.. నాకిప్పుడు వచ్చిన ఈ కల నా కళ్ళు తెరిపించింది."

"నిజమేరా రాముడూ! ఆ కల రాకపోయి వుంటే అలాగే జరిగేది. ప్రస్తుతం అమ్మాయి వున్న పరిస్థితుల లాంటివి. ప్రతిరోజు ఇటువంటి ఘోరమైన చావు గురించి వార్తాపత్రికలలో ఎన్ని చదవడం లేదు మనం? అన్నాడు శేషయ్య.

"ఇక చెప్పకు శేషూ! నేను భరించలేను. తెల్లవారగానే వెళ్ళి నా బిడ్డను మా వూరికి తీసుకెళతాను." అన్నాడు నిశ్చయంగా వణుకుతున్న గొంతుతో.

"మంచిది. అలా చెయ్యి." అంటూ స్నేహితుని భుజం తట్టి.

"ఇక నిశ్చింతగా నిదురపో. టైం ఒంటిగంట అవుతుంది." అంటూ లేచి వెళ్ళి తన మంచం మీద పడుకున్నాడు శేషయ్య.

తెల్లవారగానే కూతురిని తన వెంట వూరిక పిలుచుకెళ్ళాలని నిశ్చయం చేసుకున్నాక వెంకట్రామయ్య మనసు తేలిక పడగా మంచంపై మేను వాల్చి నిశ్చింతగా కళ్ళు మూసుకున్నాడు. □




